Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# గురజాడ స్త్రీ పాత్రల అపూర్వ నైతికధృతి

డా. గొట్టిముక్కల స్వర్ణలత,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
వినుకొండ, పల్నాడు జిల్లా,
ఆంధ్రప్రదేశ్.

ఆధునికాంధ్ర సామాజిక సాహిత్య నిర్మాణంలో గురజాడది అత్యంత ప్రభావవంతమైన పాత్ర. గురజాడ ప్రత్యేకత ఏమిటంటే ఆయన ఎప్పటికప్పుడు గొప్ప ఆధునికుడిగా అనిపించటమే. 19వ శతాబ్దపు ద్వితీయాంకంలో (1862) జన్మించిన గురజాడ, తన చుట్టూ అలుముకున్న చిమ్మచీకటిని అవలీలగా తోసివేసి, ఆవల కనిపిస్తున్న వెలుగుజాడను స్పష్టంగా చూడగలిగాడు. వర్తమానంలోని శైధిల్యాన్ని చూడగలగడంతోపాటు భవిష్యనిర్మాణంపై కూడా స్పష్టమైన ఊహకలిగి ఆ దిశగా తన కలాన్ని కదిపాడు గురజాడ. తన సమాజం గొప్ప ఉన్నతిని సాధించాలని తనవారు ప్రగతిదారులవెంట నడవాలని తపించాడు. జీవించి ఉన్న అతి స్వల్ప కాలంలోనే అనితరసాధ్యమైన సాహిత్యోద్యమాన్ని నిర్మించాడు. భాషలోనూ, భావంలోనూ, శిల్పరీత్యానూ, అనన్యసామాన్యమైన రచనలు చేసి తెలుగువారిలో గొప్ప భావ విప్లవానికి కారకుడయ్యాడు.

"సామాజిక చారిత్రక పరిణామ గమనంలో కవి యొక్క సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశాలీ అయితే ఆ గమనాన్ని అతను మరింత వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను" అన్న శ్రీశ్రీ మాటలు గురజాడ రచనలను అర్థం చేసుకోవడంలో ఉపకరిస్తాయి. తన సమకాలంలోని మేధావులందరిలోనూ కూడా గురజాడ గొప్ప మానవతావాదిగా, ప్రజాస్వామికంగా కనిపిస్తాడు. గురజాడ విలక్షణత, నిబద్ధత ఆయన సాహిత్యంలోనే కాకుండా ఆయన పలువురికి రాసిన లేఖల్లోనూ వ్యక్తమవుతుంది.

ఐరోపాలో ప్రారంభమై విస్తరించిన పునరుజ్జీవన తాత్వికతను అర్థం చేసుకోవడమే కాక సంపూర్ణంగా విశ్వసించి జీర్ణం చేసుకున్నాడు కనుకనే తన సమకాలపు మేధావుల కంటే గురజాడ ముందున్నాడు. బ్రిటిష్ పాలనలో ఆధునిక విద్య భారతీయ మేధావులందరిలో ఆలోచనా వినిమయానికి దారితీసింది. భావ సారూప్యతగల మేధావుల రచనలను గురజాడ సవిమర్శంగా అధ్యయనం చేశాడన్నదానికి ఆయన రచనల్లో ఉదాహరణలను ఋజువులుగా చూపవచ్చు.

"సాంఘిక అవినీతి క్రిములతో నిండిన దుర్భరదాస్యం నుండి మహిళలను కాపాడడానికి సమాజాన్ని అప్రతిష్టపాలు చేసే పరిస్థితిని కళ్ళ ఎదుటపెట్టి నైతిక భావాల ఉన్నత ప్రమాణాన్ని ప్రాచుర్యానికి తేవడం కంటే సాహిత్యానికి ఉత్తమమైన కార్యమేదీ ఉండదన్న" గురజాడ మాటల్లోనే ఆయన సాహిత్య లక్ష్యం ఇమిడి ఉంది. సమాజంలోని స్త్రీల వాస్తవస్థితి పట్ల అవగాహనతో కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వితంతు

Cover Page
INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

సమస్యలు, అత్యాచారాలు, వేశ్యల వేదనలు, స్త్రీ విద్యావశ్యకత, వివాహ వ్యవస్థలోని లోపాలు తదితర ఎన్నో అంశాలను సునిశితంగా పరిశీలించి, వాటిని సాహిత్య వస్తువులుగా ఎన్నుకున్నాడు గురజాడ. ఈ రచనల్లో ఆయన సృష్టించిన కొన్ని స్త్రీ పాత్రలు పితృస్వామిక వ్యవస్థలో కునారిల్లుతున్నప్పటికీ పురుషులకంటే మిన్నగా నైతికధృతిని కలిగి ఉండడం గురజాడ సమాజంలో స్త్రీ స్థానం గురించి మనసు పెట్టి ఆలోచించినట్లు అర్థమవుతుంది. మానవ చరిత్ర అంటే స్త్రీల చరిత్ర కూడా అంటూ గొప్ప ప్రజాస్వామిక దృక్పథాన్ని మొదటిసారిగా తెలుగుసాహిత్యానికి పరిచయం చేశాడు గురజాడ.

1897లో ముద్రితమైన కన్యాశుల్కం తెలుగువారికి ఆధునిక నాటకాన్ని పరిచయం చెయ్యడంతోపాటు వర్తమానంలోని ఇతివృత్తంలో మనకళ్ళ ఎదుట మసలే ఆధునిక స్త్రీ పురుషుల జీవితాన్ని నాటకంగా మలచవచ్చునన్న విషయాన్నీ మనకు పరిచయం చేసింది. బండరాయిలా పడివున్న తెలుగుభాష జీవనోత్సాహంతో ఉరకలెత్తడాన్నీ గురజాడ ఈ నాటకంతో చూపించాడు. సునిశితమైన హాస్యంతో సాంఘిక సమస్యల వికృతత్వాన్ని ఎలా చీల్చి చెండాడవచ్చో కూడా ఈ నాటకంతో చూపించాడు గురజాడ.

“నేను చదివినంతమట్టుకు విశ్వసాహిత్యంలో మధురవాణితో పోల్చదగిన పాత్ర మరొకటిలేదు” అన్నాడు శ్రీశ్రీ. “గాడిదల మధ్య గోవుమాలక్ష్మిలాగా, కాకుల మధ్య కోకిలలాగా, పాలు, నీళ్లు కలగలిపిన ఈ లోకంలో హంసలాగా మధురవాణిని నిలబెట్టిన ఘనత గురజాడది” అన్న జి.ఎన్. చలం గారి మాటలు కన్యాశుల్కంలోని పాత్రల స్వరూప స్వభావాలను తెల్పుతాయి. మధురవాణిలోని గొప్పతనం కన్యాశుల్కమంతటా విస్తరించి గురజాడలోని మానవత, వివేకం, ధైర్యం మధురవాణిలోనూ కనిపిస్తాయి. ఆమె ప్రమేయంలేని సందర్భమేది కన్యాశుల్కంలో లేదు అనేవిధంగా ఆమె పాత్రను తీర్చిదిద్దాడు గురజాడ. వివాహవ్యవస్థకు, బ్రాహ్మణీయ భావజాలానికి వెలుపల ఉండడం చేత ఆనాటి బూటకపునీతులపై ఆమె దాడి చేయగలిగింది.

గిరీశం ఆటకట్టించి అతడిబారినుండి అమాయక స్త్రీలను కాపాడగలిగింది. రామప్పంతులి మోసాలకు అడ్డుకట్టవేసి అతని ఇంటినుంచి అతన్నే వెళ్ళగొట్టగలిగింది. లుబ్ధావధాన్లు, అగ్నిహోత్రావధాన్లు లాంటి మూర్ఖుల చేతులతో పసిపిల్లను బలికానివ్వక రక్షించింది. రామప్పంతులి మాయమాటలు నమ్మి మోసపోయిన వితంతువు మీనాక్షిని పెళ్లిచేసుకోమని అతనితో పోట్లాడుతుంది. ఎవరికీ ఏ హానీ జరక్కుండా నాటక సమస్యనే పరిష్కరించి యాంటీనాచ్ సౌజన్యారావు చేతనే కరచాలనం తీసుకొంటుంది మధురవాణి.

“మీతోబుట్టువుకు ఆపదవస్తే అది నాది కాదా” అనడమే కాదు ఆచరణలోనూ అందుకోసం తనస్వార్థాన్ని వదులుకోడానికి సైతం సిద్ధపడుతుంది. “లోకమందలి ధనమంతయు ఒక సత్పురుషుని ముద్దుకు సాటిరాదన్న” ఆమె అభిప్రాయంగాని, “చెడనివారిని చెడగొట్టనన్న” ఆమె సౌజన్యం గాని, “సానిదానికి మాత్రం నీతి ఉండొద్దా”, “వేశ్యనయినా దయాదాక్షిణాలకి డబ్బునాశించను” అనే మాటలు గానీ అనన్య సామాన్యం. ఒక్కమాటలో చెప్పాలంటే అగ్రహారపు బురదగుంటలో కలువలాగా మధురవాణిని సృష్టించాడు గురజాడ.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ముత్యాలసరాలులో పూర్ణమ్మ, కన్యక రెండూ అపురూపమైన పాత్రలే. కాసుకులోనై బతకమనే వర్గసమాజం, దేవుడు, మతం, ఆచారాల పేరిట కన్నబిడ్డలనే తెగనమ్ముకుంటున్న దుర్మార్గానికి నిరసనగా సృష్టించిన కావ్యమే పూర్ణమ్మ.

"కాసుకులోనై తల్లీదండ్రీ

నెనరూ న్యాయం విడనాడి

పుత్తడిబొమ్మను పూర్ణమ్మను వొక

ముదుసలి మొగుడుకు ముడివేస్రీ" అంటూ ఆనాటి బాల్యవివాహాల తీరును చెబుతూ

"ఆటల పాటలతోడి కన్నియలు

మొగుడు తాతయని కేలించ

ఆటలపాటల కలియక పూర్ణమ్మ

దుర్గను చేరీ దుక్కించె" అంటూ పూర్ణమ్మ బాధను చిత్రించాడు. ఈ గేయంలో కీలకమైన విషయం పూర్ణమ్మ సందేశం.

"నలుగురు కూచుని నవ్వేవేళల

నా పేరొక తరి తలవండి

మీమీ కన్నబిడ్డల నొకతెకు

ప్రేమతో నా పేరివ్వండి.." అని తన అన్నదమ్ములకు వీడ్కోలు చెబుతూ తనకు జరిగిన అన్యాయాన్ని సదా గుర్తించుకోమని ఇకముందు పుత్తడిబొమ్మలకు ఈ అన్యాయం జరగకుండా తన ఆత్మాహుతి ఎన్నటికీ గుర్తుండేలా వారి బిడ్డలకు తన పేరు పెట్టుకోమనీ గురజాడ ఒక గుప్తసందేశాన్ని ఆమెద్వారా సమాజానికి అందించాడు. అందమైన బట్టలకీ, నగలకీ మురిసే వయస్సులో ఉన్న పూర్ణమ్మ తనకు అన్యాయం జరిగిందని గుర్తించగల చైతన్యాన్ని కలిగిఉండడం దానికి లోబడకుండా తన నిరసనను (ఆత్మాహుతిని) ప్రకటించడానికి కావలసినంత నైతికధృతిని కలిగి ఉండడం గురజాడ అడుగుజాడగా చెప్పుకోవచ్చు.

కండబలమితో కన్యలను చెరబట్టే రాచరిక దురహంకారానికి ధిక్కారప్రకటనే కన్యక. ఈ గేయాన్ని గురజాడ మద్రాసులోని తెలుగు వైశ్యుల కోరికపై రాసినట్టు తెలుస్తుంది. వేంగి ప్రభువు రాజరాజ విష్ణువర్ధనుడు పెనుగొండ సామంత రాజైన కుసుమశ్రేష్ఠి కుమార్తె వాసవి కన్యకను మోహిస్తాడు. ఆమె రాజవీధికి వెళుతుండగా ఎదురైన రాజు

"పట్టవలెరా దీని బలిమిని

కొట్టవలెరా మరుని రాజ్యం

International Journal of Multidisciplinary Educational Research
ISSN:2277-7881; Impact Factor :9.014(2024); IC Value:5.16; ISI Value:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

కట్టవలెరా గండపెండం

రసిక మండలిలో" ... రసికతగా చెలామణి అయిన రాజు దుర్మార్గాన్ని, రాజు యొక్క ఉద్ధతిని, దుర్మార్గాన్ని ఈ పాదాలు వ్యక్తం చేస్తాయి.

"డేగ పిట్టను పట్టి విడుచున!

కన్నె యింటికి మరలి నడుచున" అంటూ సాగిన పురుషాహంకారాన్ని, అరాచకాన్ని నిరసిస్తూ

"పట్టమేలే రాజువైతే

పట్టునన్నిప్పుడునుచు

చుట్టిముట్టిన మంటలోకి

మట్టి తాజనియెన్" ... అంటూ అతడి దౌర్జన్యపు పాణిగ్రహణాన్ని తిరస్కరిస్తూ ఆగ్రహంతో కలగలిసిన నిరసనతో అగ్నికి ఆహుతి అవుతుంది కన్యక. తాను బలి అవుతూ కూడా తన జాతి వారిని

"ఆశచేయక కాసువీసం

కలిగిఉంటే చాలుననుకొని

వీర్యమెరుగక విద్య నేర్చినచో

బుద్ధిమాలినచో కలుగవా ఇక్కట్లు"

అని ప్రశ్నిస్తూ స్త్రీలపై జరిగే అమానుష చర్యలను ప్రతిఘటించాలని పరాక్రమాన్ని పెంచుకోవాలని స్ఫూర్తినిస్తుంది కన్యక. రాచరికపు అహంకారాన్ని సవాలు చేస్తూ ఆత్మత్యాగం చేసుకున్న ఆత్మాభిమానిగా కన్యకను భావించవచ్చు.

గురజాడ కంటే ముందే దాదాపు 1889 నుండి మహారాణి, జనాన, హిందూ సుందరి, కల్పలత, శారద, సావిత్రి, కృష్ణాపత్రిక మొదలైన పత్రికల్లో దాదాపు 57 కథలు వచ్చాయి. వంగూరి నందీశ్వర్రావు, బండారు అచ్చమాంబ, ఆచంట సాంఖ్యాయనశర్మ, పులుగుర్తి లక్ష్మీనరసమాంబ మొదలైన కథకులు వ్రాసినవి ఆ కథలు. 1910లో వెలువడిన గురజాడ దిద్దుబాటును ఆ కథలతో పోల్చిచూస్తే గురజాడతో కథ ఒక ఆధునిక రూపాన్ని సంతరించుకుందని తెలుస్తుంది. వాస్తవికతతో పాటు కళాధర్మాన్ని సాహిత్య ప్రయోజనంగా గురజాడ భావించినట్లు ఆయన రచనలన్నీ నిరూపిస్తాయి.

దిద్దుబాటు వేశ్యాలోలత్వంతో చెడిన భర్తను బాగుచేసుకునే దక్షత గల స్త్రీ కథ. స్త్రీ లోలుడైన గోపాల్రావు సానులతో గడపడం కోసం ప్రతిరోజు సంఘాన్ని ఉద్ధరించే ఉద్యమాలు చేస్తున్నానని ఇంటికి రాకపోవడానికి గల అసలు కారణాన్ని ఇరుగుపొరుగు వారి ద్వారా తెలుసుకున్న కమలిని తాను పుట్టింటికి పోతున్నట్టు ఉత్తరం రాస్తుంది. దాని ద్వారా గోపాల్రావుకు అతడు చేస్తున్న తప్పునేగాక, భార్య అవసరాన్నీ అతడిచేత గుర్తింపచేస్తుంది. భయంచేతో లేక సహృదయం చేతనో అతనిలో మార్పొస్తుంది. భర్త తిరస్కారానికీ, నిరాదరణకీ గురై ఏమిచేసినా సహించే పతివ్రతాస్థాయిని మించి శక్తియుక్తుల్ని ప్రయోగించి

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

అతడిని సరిదిద్దిన మహిళాచాతుర్యమే దిద్దుబాటు. పాలేరుతో "సృష్టిలోకెల్ల ఉత్కృష్టమైన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే" అనీ, "నీ కూతురు బడికి వెళ్తున్నది గదా! విద్యవిలువ నీకే బోధపడుతుంది. మీవాళ్ళ కంటే అప్పుడే దానికి ఎంత నాగరికత వచ్చిందో చూడు" అని గోపాల్రావుతోనే అనిపిస్తాడు గురజాడ. విద్యనేర్చిన స్త్రీ ఏ సమస్యనైన చక్కగా పరిష్కరించగలదన్న నమ్మకం గురజాడది.

కథాశీర్షిక, కథారంభం, కమలిని రాముడులు గోపాల్రావుకు కనువిప్పు కలిగించేందుకు ఆడిన అంతర్నాటకం, చదివించే గుణం మొదలైన పలుఅంశాలు గురజాడ శిల్ప పరిజ్ఞానాన్ని సూచిస్తాయి.

గురజాడకు సమకాలీన సంస్కరణోద్యమాలపట్ల ఉన్న అసంతృప్తిని సంస్కర్త హృదయంలో చూడొచ్చు. వేశ్యావృత్తిని నిర్మూలించాలనేవాళ్లతో ఆయనకు అభిప్రాయభేదం లేదుగానీ ఒట్టి నైతికదృష్టితో తప్ప వారు ఈ సమస్యను ఆర్థికదృష్టితో, సాంఘికదృష్టితో అంతకుమించి మానవతాదృష్టితో చూడడం లేదన్నది ఆయన ఫిర్యాదు. వృత్తి మానుకున్న వేశ్యలు ఎలా బతకాలి? వారూ మనుషులే కదా. జీవితంలో సుఖించే హక్కు వాళ్లకూ వుంది. వాళ్ళ జీవిత సౌఖ్యానికి ఈ ఉద్యమకారులు చూపించే మార్గం ఏమిటి? అనేవి ఆయన లోతైన ప్రశ్నలు.

సరళ అనే వేశ్యను సన్మార్గంలో ప్రవేశపెట్టే ప్రయత్నంలో రంగనాధయ్యారు తనలోని కామవాంఛకూ, సౌందర్యదాహానికి వశుడై అపహాస్యం పాలు కావడం ఈ కథలోని ఇతివృత్తం. గురజాడకు అసంతృప్తి కలిగించిన కుహనా సంస్కర్తలకు రంగనాథఅయ్యర్ ప్రతినిధి.

సరళ వేశ్యావృత్తిలో ఉన్నప్పటికీ ఆ వృత్తి మురికికూపమని గ్రహిస్తుంది. దానినుండి బయటపడాలని కోరుకుంటుంది కూడా. రంగనాధయ్యర్ నుంచి డబ్బు తీసుకొని ఆమెను మార్చడానికి వచ్చిన విశ్వనాథశాస్త్రిని తన ప్రశ్నల వర్షంతో ఉక్కిరిబిక్కిరి చెయ్యగల చాతుర్యంగలది సరళ. ఆమెకు భారతం గురించి చెబుతున్నప్పుడు "చంద్రవంశపు రాజుల నెత్తురు సానివాళ్ళదే కాదుటాండీ" అని సూటిగా అంటుంది. వివాహవ్యవస్థలోని లోటుపాట్లు కూడా ఆమెకు చక్కగా తెలుసు. అందుకే వేశ్యావృత్తిమాని వివాహం చేసుకోవచ్చు కదా అన్నప్పుడు "అంటే యెవడో ఒక ఛండాలుడికి నేను కలకాలం పూర్తిగా బానిసనై పడివుండాలనా మీ తాత్పర్యం" అంటుంది. స్త్రీకి, అందులో భోగం స్త్రీకి వివాహమే విముక్తి అన్న రంగనాథయ్యరు వంటి సంస్కర్తల ఆలోచనలను సరళ తలక్రిందులు చేసింది. కుటుంబ జీవితమే సంకుచితమై పురుషాధిక్యంలో నలిగిపోతూవుంటే పెళ్లిని పరిష్కారంగా చూపించడమనేది అనవసరమని ఆమె విశ్లేషిస్తుంది. "నాబోటి భోగం పిల్లను ఏ మర్యాదస్తుడు పెళ్ళాడుతాడో చెప్పండి మీరే" అంటూ ఆమె రంగనాథయ్యర్ కు వేసిన ప్రశ్నలు నిజానికి గురజాడవే.

"సానిపిల్లలో ఉండే మానవత్వాన్ని మరిచిపోకు. ఆమె సైతం ఒక మానవవ్యక్తి అనే మాటను విస్మరించకు. ఆమె విచారం, కన్నీళ్లు, సంతోషం, ఆనందభాష్పాలు, నీనా సుఖదుఃఖాల వంటివే. మన అనుభూతులవలె అవీ గణుతింపదగినవే. గంభీరమైనవే. అవినీతిపరారులైన భార్య లేక వ్యభిచారి అయిన భర్త లేదా వీరిద్దరిలోనూ కూడిన సమాజం ఏరీత్యా ఒక సానిపిల్ల కంటే మిన్న? వ్యభిచారమే తన వృత్తిగా లేబిల్ వేయబడ్డ భోగం పడుచు సమాజాన్ని మోసగించడంలేదు. ఆమెకున్న లేబిల్ దృష్ట్యా ఆమె జీవితం సరైన తోవనే సాగుతున్నది. ఆమె ఏ వివాహబంధాలనూ, వైవాహిక సూత్రాలనూ ఉల్లంఘించడం లేదు"

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :9.014(2024); IC VALUE:5.16; ISI VALUE:2.286
UGC Approved (2017), Peer Reviewed and Refereed International Journal
Volume:13, Issue:12(1), December: 2024
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

అంటాడు గురజాడ. ఈ విషయాలను అర్థం చేసుకోగల హృదయసంస్కారం యాంటినాచ్ ఉద్యమకారులకు లేదనే బాధ ఈ కథలో కనబడుతుంది.

'మీ పేరేమిటి' కథానికలోని సామాన్య కుటుంబస్త్రీ నాంచారమ్మను కార్యశూరురాలైన వనితగా తీర్చిదిద్దాడు గురజాడ. ఈ కథలో మతాచారాల పేరుమీద సాగే స్వార్థపరత్వాన్ని ఎండగట్టాడు. శైవవైష్ణవ శాఖల అనుయాయులు మతమౌఢ్యం చాటున బతుకుతెరువు రాజకీయాలు నడపడం ఇందులోని ఇతివృత్తం. శైవులు, వైష్ణవులు ఎవరికివారు తామే గొప్ప అనుకుంటూ నిష్క్రియంగా కాలం గడపడం, వైష్ణవులు నిప్పులగుండం తొక్కాల్సివచ్చేసరికి ఏవో సాకులు చెప్పుకుంటూ వెనుకడుగు వేసి చివరికి వృద్ధుడైన గుడిపుజారిని బలవంతంగా నిప్పులగుండం తొక్కించాలని తీసుకొస్తారు. ఆయన కొడుకు భయపడి అటకమీద కూర్చుంటే కోడలు నాంచారమ్మ వారి ప్రయత్నానికి అడ్డు తగులుతుంది. "రాముడేకాదు ఏ దేవుడు మీదనయినా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే ఒక్క గుండమే కాదు. అన్నికష్టాలూ తరించవచ్చును. నేను మా మామగారి పేరు స్మరిస్తూ గుండం తొక్కుతాను. నా వెంట రాగలిగిన వైష్ణవులెవరైనా ఉంటే ఎదటికి రండి" అంటూ ధైర్యంగా సవాలు విసురుతుంది. చివరికి పీరుసాయిబుని పీరుదాసుగా మార్చి అతడు కూడా వైష్ణవుడే అని అతనిచేత నిప్పులగుండం తొక్కించి మనుషులంతా సమానమే అని నిరూపిస్తుంది. శైవ వైష్ణవ భేదం లేకుండా అందరూ పీరుసాయిబుకు మొక్కులు చెల్లించి ఒక పండుగలాగా ఆ కార్యక్రమాన్ని నిర్వహించేలా చేస్తుంది.

గురజాడ ఆశించిన ఉన్నత సంస్కారం ఆనాటి సమాజంలోనే కాదు. ఈనాటి సమాజంలోనూ లేదనడానికి స్త్రీల మీద ప్రతిరోజూ జరుగుతున్న అకృత్యాలే ఋజువులు. ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని నమ్మిన మహనీయుడు గురజాడ కల మరో శతాబ్దానికైనా నిజమౌతుందేమో వేచిచూడాల్సిందే. అందుకే 161వ జయంతి జరుపుకుంటున్న గురజాడ మనకంటే గొప్ప ఆధునికుడు. మరల మరలా గురజాడను స్మరించడమంటే మహిళాలోకం తమ స్థితిగతుల్ని అవలోకించుకుంటూ నైతికధృతితో యుద్ధోన్ముఖంగా ముందుకు సాగడమే.

ఆధార గ్రంథాలు :

గురజాడ సాహిత్య సర్వస్వం, తెలుగు అకాడమీ. హైదరాబాద్.